క్లుప్తంగా

రైతుల సంక్షేమమే లక్ష్యం

పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి



చైర్మన్ హరికృష్ణారెడ్డి

తొగుట(దుబ్బాక): రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు అందించామని వివరించారు. సొసైటీ ద్వారా 501 మంది రైతులకు రూ 2.63 కోట్లు పంట రుణాలు అందించామని తెలిపారు. అందులో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ పథకం ద్వారా 266 మంది రైతులకు రూ.1.22 కోట్లు లబ్ధిచేకూరిందన్నారు. 235 మంది రైతులకు రూ 1.40 కోట్లు రుణాలు మాఫీ కావాల్సి ఉందన్నారు. అందులో రూ. 2 లక్షల పైన రుణాలు తీసుకున్న రైతులు ఉన్నారన్నారు. సొసైటీ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారన్నారు. సొసైటీని బలోపేతం చేసేందుకు రైతులు సహకరించాలని కోరారు. సొసైటీలో నూతనంగా సభ్యత్వం తీసుకుని సేవలను పొందాలని మండల రైతులను కోరారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సీఐ ప్రవీణ్‌కుమార్



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

సిద్దిపేటకమాన్: వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన వాహనదారులకు ట్రాఫిక్ పీఎస్‌లో శుక్రవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగాగా సీఐ మాట్లాడుతూ, నిబంధనలు పాటించి వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వాహనాలపై ఉన్న పెండింగ్ చాలాన్‌లను కట్టించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ గోపాల్ రెడ్డి, ఏఎస్ఐలు ఉమేశ్, సదాశివరావు, హెడ్ కానిస్టేబుల్ సత్యంగౌడ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ కల్యాణం



పూజలు చేస్తున్న మహిళలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చౌడారంలో శుక్రవారం పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి ఒడి బియ్యం, అభిషేకం వంటివి నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి సల్లంగా చూడు



ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

దుబ్బాక: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు తమ ఇంటి నుంచి మంగళహారతులతో ఆలయానికి వచ్చి అమ్మకు నైవేద్యం సమర్పించారు. పెద్దమ్మ తల్లి చల్లంగా చూడు అంటూ పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

మందుబాబులకు జరిమాన

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమాన విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ..పట్టణంలోని పలు ప్రాంతాలలో కొన్ని రోజుల క్రితం పోలీసు సిబ్బంది నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 9 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో శుక్రవారం హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ. 15వేల జరిమాన విధించినట్లు తెలిపారు.

శ్రావణ శోభితం



పుష్పార్చనలో పాల్గొన్న మహిళలు

గజ్వేల్ పట్టణం.. సీతారామ ఉమామహేశ్వరాలయ ఆవరణలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వాసవీ మాతకు లక్ష పుష్పార్చన నిర్వహించారు. వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమ్మకు ప్రత్యేక పూజలతోపాటు గోపూజ, సామూహిక వాసవి పారాయణం గావించారు.

– గజ్వేల్‌రూరల్



సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా సిద్దిపేటలోని గౌరీ నీలకంఠేశ్వర ఆలయంలో శుక్రవారం ఉదయం నుంచే గౌరీ వ్రతం,కుంకుమార్చన, తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చన, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌ను సుందరంగా అలంకరించారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

తిమ్మాయిపల్లిలోని మహంకాళి ఆలయంలో నాలుగో శుక్రవారం పురస్కరించుకొని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పూజారి బ్రహ్మచారి, మహిళలు పాల్గొన్నారు.

– నంగునూరు(సిద్దిపేట)

వైభవంగా ఎడ్లబండ్ల ఊరేగింపు



ఆలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూపరాణి, నాయకులు

మహంకాళి అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించిన భక్తులు



చేర్యాల(సిద్దిపేట): శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పట్టణ కేంద్రంలో బండ్ల బోనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్నికులాల ప్రజలు ఎడ్లబండ్లతో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం మహిళలు మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమం ఆదివారం సాయంత్రం పోచమ్మ బోనాల సమర్పణతో ముగుస్తోంది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి, కౌన్సిలర్లు చెవిటి లింగం, ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, మాజీ జెడ్పీటీసీ దాసరి కళావతి, నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, ముస్త్యాల యాదగిరి, తుమ్మలపల్లి సంజీవులు, సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మనుషులు అంతా ఒక్కటే



జగదేవ్‌పూర్(గజ్వేల్): మాట్లాడుతున్న ఆర్‌ఐ షాహెద్

జగదేవ్‌పూర్(గజ్వేల్): కుల వివక్షత పాటించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆర్‌ఐ ఎండీ షాహెద్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మరాఠి కృష్ణమూర్తిలు పేర్కొన్నారు. మండల పరిధిలోని నిర్మల్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవం సభలో వారు మాట్లాడారు. సమాజంలో మనుషులంతా ఒక్కటేనని, కుల వివక్షత పాటిస్తూ చిన్నచూపు చూడటం తగదన్నారు. కుల రహిత సమాజం కోసం హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో కల్పించిన హక్కుల ద్వారా కుల వివక్ష పాటించే వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సుభాశ్, పంచాయతీ కార్యదర్శి మమత, అంగన్‌వాడీ టీచర్ అనిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుగ్గిల్లలో

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్లలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జనగామ జిల్లా కార్మిక శాఖ అధికారి కుమారస్వామి, హెడ్ కానిస్టేబుల్ కనుకయ్య, ఆర్‌ఐ సంతోష్ కుమార్, స్వామి, వంశీదర్, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మోతెలో..

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట- భూంపల్లి మండలంలోని మోతె గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని అధికారులు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రవీందర్, ఏఎస్ఐ బాలములయ్య, తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ సంతోశ్ కుమార్, మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్, నాయకులు రమేశ్, యాదగిరి, సురేశ్, రంజిత్, సాగర్, మహేశ్ పాల్గొన్నారు.

వెండి హారం బహూకరణ



ఎల్లమ్మతల్లికి వెండిహారం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ తల్లికి రూ.1.50 లక్షల విలువ చేసే వెండి హారాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్ సమర్పించారు. సతీశ్‌కుమార్, షమిత దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. దంపతులు గతంలో మొక్కుకున్న మాట ప్రకారం హారాన్ని సమర్పించి, పట్టు వస్త్రాలు అందజేసి పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని గృహిణి ఆత్మహత్య

గంభీర్‌పూర్‌లో ఘటన

దుబ్బాకరూరల్: ఉరి వేసుకుని గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని గంభీర్‌పూర్‌లో శుక్రవారం జరిగింది. సంఘటనకు సంబంధించి ఎస్ఐ గంగరాజ్ తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన రెడ్డి రవళి(25) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుకి గల కారణాలు తెలియరాలేదు. ఆత్మహత్యపై పోలీసులకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

హుస్నాబాద్‌రూరల్: బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు శంకర్‌నాయక్‌ను శుక్రవారం సన్మానించారు. మండలంలోని పోతారం(ఎస్) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించిన ఆయన, ప్రమోషన్ రాగా బదిలీపై వెళ్లారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని శంకర్ కోరుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వ నమోదు కీలకం

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాంరెడ్డి



వర్గల్(గజ్వేల్): మాట్లాడుతున్న రాంరెడ్డి

వర్గల్(గజ్వేల్): దేశంలో, రాష్ట్రంలో బీజేపీ పటిష్టతకు సభ్యత్వ నమోదు అత్యంత కీలకమని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎల్లు రాంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వర్గల్ మండలం నాచారం సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశానికి ఆయనతోపాటు జిల్లా అధికార ప్రతినిధి నందన్‌గౌడ్, కన్వీనర్ తిరుపతిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మండల పార్టీ అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ రక్షణ లక్ష్యంగా పురోగమిస్తున్న బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు పార్టీని బలోపేతం చేసేందుకు ఫోన్ నంబర్ 8800002024కు మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీరామ్ శ్రీకాంత్, పంజాల వెంకటేశ్‌గౌడ్, దిండి నాగరాజు, బబ్బూరి రవీందర్, బద్రీనాథ్‌గుప్త, మధు గౌడ్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోహెడ(హుస్నాబాద్): బీజేపీ బలోపేతానికి సభ్యత్వమే కీలకమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. కార్యకర్తలు గ్రామాలలో విరివిగా సభ్యత్వం చేయాలని సూచించారు. ప్రతీపోలింగ్ బూత్‌లో 200 సభ్యత్వాలకు తగ్గకుండా కార్యకర్తలు కష్టపడాలని సూచించారు. వచ్చేనెల 4న జిల్లా కేంద్రాలలో, 5న మండలాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పిల్లి నర్సయ్య, రజనీకాంత్‌రెడ్డి, బాపురెడ్డి, గుగ్గిళ్ల శ్రీనివాస్, చేను తిరుపతి, హరిదాస్, వెంకటేశ్, లక్ష్మయ్య, రాంచంద్రారెడ్డి, సత్యనారాయణరెడ్డి, అచ్యుత్, సుమన్ పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: ప్రతీఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అయినప్పటికీ ఉద్యోగానికే విరమణ కానీ ప్రజాసేవకు కాదని సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాయపోలు మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు పి. శ్రీనివాస్ రెడ్డి ఉద్యోగ పదవీ విరమణ అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించాలంటే ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులు జన్మనిస్తే, జీవితంలో ఉన్నతంగా బతికే స్థాయి విలువలు అన్నీ కూడా ఉపాధ్యాయులు నేర్పిస్తారన్నారు. అలాంటి ఉపాధ్యాయ వృత్తికే పి. శ్రీనివాస్ రెడ్డి వన్నె తెచ్చారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

గజ్వేల్‌రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినపుడే వ్యాధులు దరిచేరవని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పేర్కొన్నారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డులతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థలలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని, మురుగు కాలువలు, గుంతలో నీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

మద్దూరు(హుస్నాబాద్): బెక్కల్ గ్రామంలోని రామలింగేశ్వర ఆలయా భూమిని ఆక్రమించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని దేవాలయ కమిటీ చైర్మన్ చొప్పరి మల్లేశం, కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం దూళ్మిట్ట తహసీల్దార్ మధుసూదన్, మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్‌లకు వినతి పత్రాలను అందించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు మాట్లాడుతూ దూళ్మిట్ట మండలం బెక్కల్ గ్రామ రామలింగేశ్వర ఆలయానికి సంబంధించి 3 ఎకరాల 10 గుంటల భూమిని ఎడవెల్లి చంద్రారెడ్డి, నందనబోయిన రేణుకలు ఆక్రమించుకున్నారని అన్నారు. అక్రమంగా పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. వారి చేర నుంచి దేవదాయ భూమి రక్షించి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

రుణమాఫీపై ఆందోళన వద్దు



గజ్వేల్‌రూరల్: అక్కారంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

గజ్వేల్‌రూరల్: రుణమాఫీపై ఆందోళనలు చెందవద్దని, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని గజ్వేల్ ఏఓ నాగరాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని అక్కారంలో రైతు వేదికలో శుక్రవారం రూ. 2లక్షల రుణమాఫీకి సంబంధించి రుణమాఫీ వర్తించని రైతుల వివరాలను సేకరించారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం రుణమాఫీకి అర్హులైన ప్రతీఒక్కరి వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. రుణమాఫీకి అర్హులై రేషన్‌కార్డు లేనివారి కుటుంబ నిర్ధారణ సర్వే చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈవో జ్యోతి, గ్రామస్తులు యాదగిరి, నీలారెడ్డి, బాల్‌రాజు, మన్సూర్, భిక్షపతి, దాతర్‌పల్లి లక్ష్మణ్ తదితరులున్నారు.

రైతుల వివరాల సేకరణ

మద్దూరు(హుస్నాబాద్): రేషన్ కార్డు లేని కారణంగా రుణమాఫీ కాని రైతుల వివరాలను ప్రత్యేక ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని ఏఓ రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని రేబర్తి, సలాఖపూర్, గాగ్గిళ్లాపూర్ గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 69 కుటుంబాలను నిర్ధారణ చేసి రుణమాఫీ మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ఏఈఓ కల్పన ఉన్నారు.

సర్వేకు సహకరించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): రుణమాఫీ కాని రైతుల వివరాల కోసం వ్యవసాయాధికారులు చేపడుతున్న సర్వేకు రైతులు సహకరించాలని ఏఓ వెంకట్రావమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని గౌరయపల్లిలో సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ రమ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి**

చిన్నకోడూరు(సిద్దిపేట): బీజేపీ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు సూరగోని శేఖర్ గౌడ్ అన్నారు. శుకవారం చిన్నకోడూరులో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేసి అత్యధిక సీట్లు బీజేపీవి గెలిపించుకోవాలన్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అక్కి సంతోశ్, యువ మోర్చా మండలాధ్యక్షుడు నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

◆ **పరిసరాల పరిశుభ్రత ముఖ్యం**

మద్దూరు(హుస్నాబాద్): గ్రామంలోని ప్రజలు తమ ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రేబర్తిలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. కుండల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. కుండలు, డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ,ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

◆ **కార్యకర్తలకు అండగా ఉంటాం: కాంగ్రెస్**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు బొమ్మల యాదగిరి అన్నారు. సిద్దిపేట అంబేడ్కర్ నగర్ పోచమ్మ గల్లికి చెందిన పార్టీ కార్యకర్త బండి నగేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. శుక్రవారం మృతుడి ఇంటికి బొమ్మల యాదగిరి వెళ్లి, నగేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాలుగా ఆదుకునేలా, సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు.

◆ **క్రీడా దుస్తుల అందజేత**



వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం చౌదరిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.35 వేల విలువైన స్పోర్ట్స్ డ్రెస్సులను దాతలు జూపల్లి శ్రీకాంత్‌రెడ్డి, గొడుగు స్వామి, జంగం రాజు, పూరం ఆంజనేయులు అందజేశారు. విద్యార్థి ప్రాథమిక దశ నుంచే చదువుతోపాటు ఆటలలో ఆసక్తి పెంపొందింపజేయాలనే భావనతో డ్రెస్సులు అందజేసినట్లు దాతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వెంకటేశ్వర్‌గౌడ్, హెచ్‌ఎం జైపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **డీటీఎఫ్ మండలాధ్యక్షుడిగా ప్రభాకర్**

బెజ్జంకి(సిద్దిపేట): డీటీఎఫ్ బెజ్జంకి మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఆసంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రవీణ్ కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బోనాలరాజేందర్‌ల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పుల్లూరి ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా ఐలేని రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తప్పెట ఓదయ్యలను ఎన్నుకున్నారు. మహిళా ఉపాధ్యక్షురాలిగా కే వెంకటలక్ష్మీ, కార్యదర్శులుగా సింగిరెడ్డి మనోహర్‌రెడ్డి, గాజుల మహేందర్, ఎండీ మునీర్ అహమ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టీ రాములుతో పాటు సభ్యులను కూడా ఎన్నుకున్నట్లు తెలిపారు.

◆ **టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడిగా సత్తయ్య**

జగదేవ్‌పూర్(గజ్వేల్): టీపీటీఎఫ్ జగదేవ్‌పూర్ మండల శాఖ అధ్యక్షుడిగా తీగుల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సత్తయ్య ఎన్నికయ్యారు. మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో శుక్రవారం టీపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పోచయ్య, ఉపాధ్యక్షులుగా రాములు, తులసీదాస్, సావిత్రి, కార్యదర్శులుగా సోమచారి, భాస్కర్, నరేందర్, సునీత, కార్యవర్గ సభ్యులుగా శంకర్, సత్తయ్య, వసంతరాణిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాడుతామన్నారు.

◆ **వివరాల సేకరణ**

మిరుదొడ్డి(దుబ్బాక): రేషన్ కార్డు లేని కారణంగా రుణమాఫీ కాని రైతులను నిర్ధారణ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ ప్రక్రియ చేపట్టామని ఏఓ సత్యాన్వేష్ తెలిపారు. శుక్రవారం అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని జంగపల్లిలో రుణమాఫీ లబ్ధిదారులుగా ఉండి రేషన్ కార్డులేని వారి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేశారు. ఆ మేరకు యాప్‌లో 45 మందికి చెందిన వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ లోహిత్ పాల్గొన్నారు.